: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

చాళుక్య ద్వారము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ADIKAVI NANNAYA UNIVERSITY

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 35 | 06-06-2022 | పుటలు : 4



## కొండగాలి తిరిగింది గుండె ఊసులాడింది...

### జూన్ 4 ఆరుద్ర వర్ధంతి

1983లో విడుదలైన "ఆంధ్ర కేసరి" సినిమా కోసం రాసిన 'వేదంలా ఘోషించే గోదావరి..అమర దామంలా శోభిల్లే రాజమహేంద్రి...' ఒకటైతే, 1991 లో విడుదలైన పెళ్ళిపుస్తకం కోసం రాసిన శ్రీరస్తు..శుభమస్తు.. శ్రీకారం చుట్టుకుంది పెళ్ళిపుస్తకం" రెండోది. మొదటిది రాజమండ్రి వాసులు గర్వించేలా ఇచ్చిన విలువైన కానుకైతే, రెండోది రెండు దశాబ్దాలకు పైగా పెళ్ళి వీడియో కాసెట్లలో తప్పనిసరి పాటై కూర్చుంది. ఆ మహాకవికి, సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర పరిశోధకునికి నన్నయవాణి అక్షరనివాళి!!

### రాజరాజనరేంద్రుని పట్టాభిషేక...

# సహస్రాబ్ది ఉత్సవాలకు సన్నాహాలు

రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు ప్రారంభించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ ఈసీ హాల్లో సోమవారం రాజరాజనరేంద్రుని సహస్రాబ్ది ఉత్సవాల నిర్వహణపై కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీసీ మాట్లాడుతూ రాజరాజనరేంద్రునికి రాజమహేంద్రపుర రాజ్య చక్రవర్తిగా 1022 ఆగస్టు 16 న పట్టాభిషేకం జరిగిందని, ఇప్పటికి వెయ్యేళ్ళు పూర్తయ్యాయని ఈ సందర్భంగా సహస్రాబ్ది ఉత్సవాలను విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ పట్టాభిషేకంతో పాటు 1022కు రాజమండ్రితో మరో రెండు అనుబంధాలున్నాయన్నారు. రాజరాజనరేంద్రుని ఆస్థానంలోని పండితుడు నన్నయ భట్టారకుడు మహాభారతాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించడం మొదలెట్టింది కూడా 11 వ శతాబ్దం లోనేనని, అదే సంవత్సరంలో రాజమహేంద్రవరం నగర నిర్మాణం జరిగిందని చెప్పారు. ఈ మూడు అంశాల ప్రాధాన్యతను ప్రస్తుత తరానికి వివరించే రీతిలో సహస్రాబ్ది వేడుకల నిర్వహణకు నన్నయ వర్శిటీ సంకల్పించిందన్నారు. ఈ మేరకు కొన్ని ప్రణాళికల్ని సిద్ధం చేసి భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు పంపించామని పూర్తి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. పూర్తి ప్రతిపాదనలతో ఢిల్లీ వెళ్ళి భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారాన్ని కోరనున్నట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ సహస్రాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పురప్రముఖులు, మేధావులు సహస్రాబ్ది ఉత్సవాల పై తమ అభిప్రాయాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒ.ఎస్.డి ఆచార్య ఎస్. టేకి, తెలుగు శాఖాధిపతి డాక్టర్ కెవిఎన్డి వరప్రసాద్ ,ఆంగ్ల అధ్యాపకులు ఆలీ, సహాయాచార్యులు డాక్టర్ తలారి వాసు, డాక్టర్ కె. రాజరాజేశ్వరిదేవి పాల్గొన్నారు.




సహస్రాబ్ది ఉత్సవాలపై మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు


# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

### - నేషనల్ వెబినార్‌లో వీసీ జగన్నాథరావు

మానవ జీవనానికి ఆధారమైన భూమిపై ప్రకృతి సిద్ధంగా జీవించాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ బోటని విభాగం ఆధ్వర్యంలో శనివారం నేషనల్ వెబినార్ ను నిర్వహించారు. "వరల్డ్ ఎన్విరాన్మెంటల్ డే – 2022 వన్ డే నేషనల్ వెబినార్ ఆన్ వన్ ఎర్త్ – ఎ నిచ్ ఫర్ లైఫ్" అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో వీసీ జగన్నాథరావు ముఖ్య అతిథిగా ఉపన్యసించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా 2022 థీమ్ 'ఒకే ఒకటి భూమి' అని, ప్రకృతికి అనుగుణంగా స్థిరంగా జీవించడంపై మానవాళి దృష్టి సారించాలని తెలిపారు. 1972 స్టాక్హోమ్ కాన్ఫరెన్స్కు ఒకే ఒక భూమి అనే నినాదం నేటికీ నిజమైందన్నారు. ఈ గ్రహం మన ఏకైక ఇల్లు కాబట్టి, దీని పరిమిత వనరులు మానవజాతిచే రక్షించబడాలని తెలియ జేసారు. ప్రకృతిలోని జీవరాశులన్నీ పరస్పరం ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. జీవిత చక్రాలు, జరుగుతున్న మార్పులు మరియు సంఘటనల భవిష్యత్‌పై ఆందో ళనలకు గురిచేస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని సంరక్షించ డానికి సహాయపడే సానుకూల మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పర్యావరణ హితంగా జీవించడానికి ప్రజలు తమ ప్రయత్నాలు చేయాలని, వన్యప్రాణులను రక్షించేందుకు ప్రభుత్వాలు కొత్త విధానాలను రూపొందిస్తున్నాయని తెలియజేసారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. వక్తలు డా.బి.ఆర్.ఆర్.గవర్నమెంట్ కాలేజ్ జగచ్చర్ల డా.బి.సదాశివయ్య, సి.ఎస్.వి. సీనియర్ మేనేజర్ ఎస్.రవికాంత్ రెడ్డి, ఈసీ మెంబర్ డా.జె.సునీతలు పర్యావరణ దినోత్సవ థీమ్ ఉద్దేశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డా.కె.నూకరత్నం, కన్వీనర్ బోటని విభాగాధిపతి డా.కె.శామ్యూల్ కుమార్, కో.కన్వీనర్స్ డా.వి.పద్మావతి, డా.ఎల్.ముత్యాలు నాయుడు, డా.ఎం.ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు



### జూన్ 5

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ఆజానుబాహులారా!
ఓజోను పొరను రక్షించండి!!

## సంపాదకీయం



# నారాయణభట్టు

పాయక పాకశాసనికి భారత ఘోరరణంబు నందు.....” భారత వీరుల మధ్య జరిగిన భయంకరమైన కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడికి కృష్ణుని వలె,వానస అనే బ్రాహ్మణ వంశానికి అలంకారమును, అనేక సారస్వతాలలో సమర్థుడును, తనకు ప్రియమిత్రుడును, సహపాఠీ అయిన నారాయణభట్టు అనే పండితుడు అనుకూలంగా సహాయుడై నెరవేర్పగా...” అని నన్నయగారు నారాయణభట్టు గురించి మహాభారతంలో రాసిన విషయమిది.

ఆంధ్ర మహాభారత అవతారికలో నారాయణభట్టు గురించి ఒక్క పద్యంలో ఉందితప్ప ఇంక మరెక్కడా కనిపించడం లేదు. ఈ పద్యాన్ని బట్టి నారాయణభట్టు బ్రాహ్మణుడు, వాంగ్మయ దురంధరుడు, నన్నయకు ప్రియ స్నేహితుడు, సహాధ్యాయుడనే విషయాలు తెలుస్తున్నాయి.”తోడై నిర్వహింపగన్” అనే మాట వలన నన్నయకు నారాయణభట్టు సహాయంగా నిలిచాడు. అది ఎటువంటి సహకారమో కూడా తెలియదు.

నారాయణభట్టు నన్నయభట్టు కలసి కంచిలో ఒక గురువు వద్ద చదువుకున్నారని, తర్వాత నారాయణభట్టు పశ్చిమ చాళుక్యుల మంత్రి అయ్యాడని పరిశోధకుల మాట.రాజరాజు సవతి తమ్ముడు విజయాదిత్యుడు పశ్చిమ చాళుక్య చక్రవర్తి సహాయంతో సింహాసనం నుండి తొలగించి తానే రాజు కావటానికి అనేక సార్లు ప్రయత్నించాడు.నన్నయభట్టు తన మిత్రుడైన నారాయణభట్టు సహాయంతో పశ్చిమ చాళుక్యులకు, రాజరాజుకు మైత్రి కలిగించాడు. అప్పటినుండి రాజరాజుకు శాంతి చేకూరింది. అతడు కృతజ్ఞతాపూర్వకంగా నారాయణభట్టుకు నందంపూడి గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడు.ఆ దానశాసన పాఠాన్ని నన్నయభట్టే రచించాడు.అందులో నారాయణభట్టు సంస్కృత, కర్ణాట,ప్రాకృత,పైశాచికాంధ్ర భాషల్లో కవిరాజశేఖరుడని ప్రసిద్ధి పొందినట్లు, కవీభవజ్రాంకుశ బిరుదాన్ని వహించినట్లు శాసనంలో ఉంది.

సాహిత్య చరిత్రలో వ్యక్తుల గురించి, కవుల గురించి, రచనల గురించి, అంకిత ప్రస్తావనల గురించి, ఆయా కవుల ప్రాంతాల గురించి, వంశం, గోత్రం, కులం,రచనా కాలం వంటి అనేక అంశాలపై అనేక సంశయాలు ఉంటాయి.పరిశోధకులు, విమర్శకులు వాటి గురించి అన్వేషిస్తూ, విశ్లేషిస్తూ, విమర్శిస్తూ ఎన్నో వ్యాసాలు రాస్తారు.వాటిపై పరిశోధనలు కొనసాగుతూనే ఉంటాయి.మరికొన్ని వాస్తవాలను వెలికితీసే ప్రయత్నం చేస్తుంటాయి. నారాయణభట్టు కీలకమైన పరిశోధనాంశమే.నోరి నరసింహశాస్త్రిగారు “నారాయణభట్టు” అని ఒక చదివి తీరాల్సిన నవల రాశారు కూడా.


నారాయణభట్టు నన్నయకు ఆంధ్రమహాభారత రచనలో సంస్కృత భారతంలో ఏ భాగాలను తగ్గించాలో, వేటిని పెంచాలో, వేటిని తొలగించాలో, తెలుగులో రచిస్తున్నప్పుడు ఎటువంటి భాషను వాడాలో, కన్నడంలో పంప మహాకవి ఎలా రచించాడో మొదలైన వాటి గురించి తెలియజేసి మాట సహాయం చేశాడని విమర్శకులు భావిస్తున్నారు. ఏదేమైనా నన్నయ అనేసరికి నారాయణభట్టు కూడా మనకు గుర్తుకొస్తాడు.

# చిలకమర్తి వారి స్వీయచరిత్రము

## పుస్తకం



1944లో ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం వారు శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం స్వీయ చరిత్రమును ప్రచురించారు. తెలుగు సాహిత్యంలో లభ్యమవుతున్న అతికొద్ది మంచి తొలి స్వీయచరిత్రలలో చిలకమర్తివారి స్వీయచరిత్రము కూడా ప్రామాణికమైనది. అమోఘమైన చిలకమర్తివారి జ్ఞాపకశక్తికి తార్కాణంగా నిలిచింది. నాటి సామాజిక సాహిత్య రంగాలలోని పలు అంశాలను రచయిత ఒక నిబద్ధతగల, నిజాయితీపరుడైన చరిత్రకారునిగా ఇందులో నమోదు చేయటం గమనించగలం.




శ్రీవిస్సా అప్పారావు,శ్రీ రాయసం వెంకటశివుడు గార్ల ప్రోత్సాహంతో చిలకమర్తివారు స్వీయ చరిత్రను రచించారు. పైగా 75 ఏళ్ల వయసు దాటిన వృద్ధాప్యంలో శ్రమకోర్చి స్వీయ చరిత్రను వ్రాశారు.

1944 బెజవాడలో జరిగిన అభ్యుదయ రచయితల మహాసభలో చిలకమర్తివారి స్వీయచరిత్ర బహూకరణ మహోత్సవం జరిగింది. రామమోహన గ్రంథాలయం హాలులో జరిగిన ఈ సభకు అభ్యుదయ రచయితల మహాసభ అధ్యక్షులైన తెలికచర్ల వెంకట రత్నంగారు అధ్యక్షత వహించారు. వేదికపై చిలకమర్తివారిని పడకకుర్చీలో ఆశీనులను చేశారు. ఈ సందర్భంలో చిలకమర్తివారు – “నాకు ఇప్పుడు 78 ఏళ్ళు. నా కేసు యమధర్మరాజు కోర్టుకు పోయి చాలా దినములు అయింది.హిట్లరు కలిగించిన యుద్ధం వల్ల యమధర్మరాజుకు పని ఎక్కువైంది. అందువల్ల నా కేసు హియరింగుకు రాకుండా వెనక పడ్డది. ఆ పిలుపుకు వేచి ఉన్నాను. ఈలోపు నా స్వీయ చరిత్రను వ్రాయటానికి ధనం కూడా ఇచ్చి ప్రోత్సహించిన విస్సా అప్పారావు గారికి, రాయసం వెంకట శివుడు గారికి కృతజ్ఞుడను. నేను బ్రతికి ఉండగా ఈ గ్రంథం అచ్చవుతుందని నేను తలచలేదు. గ్రంథమును ముద్రించి, దానిపై రాగల లాభం 750 రూపాయలు ఇచ్చి, ఈ సన్మానాన్ని ఇంత వైభవంగా జరిపిన అభ్యుదయ రచయితల సంఘాన్ని కృతజ్ఞతా పూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను” అన్నారు.

కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు తెలుగు సాహిత్యానికి సంఘ సంస్కరణోద్యమానికి నాట్య రంగానికి చేసిన సేవ అపారమైనది. తెలుగు ప్రజల అభ్యుదయానికి తోడ్పడే అనేక గ్రంథాలను రచించారు. గయోపాఖ్యానం, రాజస్థాన కథావళి, మహాపురుషుల జీవితాలు వంటి గ్రంథాలు తెలుగునాట దేశభక్తిని రేకెత్తించి, జాతీయోద్యమానికి విశేషంగా దోహదం చేశాయి. 14 నాటకాలు, 12 నవలలు, 20 గ్రంథాలు,మొత్తం 46 గ్రంథాలను వెలువరించారు. ‘దేశమాత’ మాసపత్రికను, ‘మనోరమ’ వారపత్రికను నడిపారు.

చిలకమర్తి వారు స్వీయ చరిత్రమును 22 ప్రకరణాలుగా విభజించారు. బాల్యదశ, నరసాపురం, రాజమహేంద్రవరాలలో విద్యాభ్యాసం, ఉద్యోగం, గ్రంథ రచన, నాటక సమాజం, వివాహం, పితృమరణం, మండల సభా యాత్రలు, పాఠశాల స్థాపనము, నాటక సమాజ పునరుద్ధరణము, ఉన్నత పాఠశాల స్థాపనపము, స్వగృహ కష్టాలు, ప్రకాశం గారి సీమ ప్రయాణం,హితకారిణీ సమాజ స్థాపనము, ముద్రణా యంత్ర స్థాపనపము, రామ మోహన పాఠశాల, బరంపురం ప్రయాణం, దేశీయ మహాసభ నిమిత్తం చెన్నపురి ప్రయాణం, దేశమాత పత్రిక, షష్టిపూర్తి, భార్యా వియోగం ఇలా ఇరువది ఒకటవ ప్రకరణం వరకూ వివరించి, చివరి ప్రకరణాన్ని చరమ ప్రకరణం పేరుతో కృతజ్ఞత అని రాశారు.తన స్వీయ చరిత్రను రాయించిన వారికి, మొదటి నుండి తనకు సహాయం చేసిన మహనీయులకు, కన్నతల్లి అయిన ఆంధ్ర దేశమునకు కృతజ్ఞతలు తెలిపారు.

‘భరతఖండంబు చక్కని పాడియావు’ పద్యం నాటి దేశ పరిస్థితులకెత్తిన వాస్తవికతా పతాక చిలకమర్తివారి గళం.’ఆంధ్ర స్కాట్’ గా కీర్తిగడించిన సమకాలిక సామాజిక పరిణామాల ఎగుడు దిగుడులను సునిశిత పరిశీలనతో గమనించి ఆయన అందించిన చరిత్ర మనకు ఎన్నో గుణపాఠాలను, అనుభవాలను నేర్పిస్తుంది. 50 ఏళ్ల ఆంధ్ర ప్రజా ఉద్యమాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. మహనీయుల సంస్కారాభిమానం ఎంత గాఢమైందో విశదమవుతుంది. వర్తమానాన్ని సంస్కారవంతంగా గడపటానికి, భవిష్యత్తును మహోన్నతమైనదిగా తీర్చిదిద్దుకోవడానికి, గతకాలంలో రచింపబడిన స్వీయ చరిత్రలను, నజీవిత చరిత్రలను అధ్యయనం చేయటం నేటి సమాజానికి ఎంతో అవసరం.

- రావూరి నరేష్ , మలికిపురం

# శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం


## బాలు జయంతి



బాలూ....
నీవు పాడిన
విశ్వవిద్యాలయ గీతం
నిరంతరం మా చెవిలో
మెదులుతూనే,మదిలో
కదులుతూనే ఉంది...
నీ స్వరం అజరామరం!!


- నన్నయవాణి

# చిత్రకారుడు శీలా వీర్రాజుకు నివాళి



ప్రముఖ చిత్రకారులు, రచయిత, సాహితీ సద్విమర్శకులు, సౌజన్యం మూర్తీభవించిన సాహితీవేత్త శీలా వీర్రాజు గారు మరణం సాహితీలోకానికి, చిత్ర కళారంగానికి ఎంతో లోటు. నన్నయ విశ్వవిద్యాలయం కేంద్ర గ్రంథాలయానికి శీలా వీర్రాజు గారు, ఆయన శ్రీమతి శీలా సుభద్రాదేవి గారు అందించిన గ్రంథాలు తెలుగు సాహిత్య ప్రపంచానికి, పరిశోధకులకు,చిత్రకారులకు ఎంతో ప్రయోజనకరమైనవి. వారి గృహ గ్రంథాలయంలోని విలువైన, అరుదైన గ్రంథాలను విశ్వవిద్యాలయంలోని 'నన్నయ భారతి' భాండాగారానికి సమర్పించారు. వారి సహకారాన్ని మేము ఎన్నడూ మరువలేము. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారికి అక్షర నివాళి!!

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం
రాజమహేంద్రవరం







శీలావి చిత్రాలు

## గూడెం క్యాంపస్‌లో మొక్కలు నాటిన విద్యార్థులు




**05.06.22 (మీడియాసెల్)** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఫార్మసీ విభాగం విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్ లో ఆదివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ఒకే ఒక భూమి' అనే నేపథ్యంతో ఫార్మసీ విద్యార్థులు క్యాంపస్‌లో మొక్కలు నాటారు. కళాశాల ఆవరణను శుభ్రం చేసి యువతకు పర్యావరణ విధానాన్ని ప్రభావితం చేసేలా చేశారు. ఈ కార్యక్రమం ఫార్మసీ స్వచ్ఛ్ భారత్ మరియు ఎన్విరాన్‌మెంటల్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

## కాకినాడ క్యాంపస్‌లో పర్యావరణ దినోత్సవం



అచ్చంపేట జంక్షన్ లో గల ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ నందు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదికవి నన్నయ యూనివర్సిటీ మరియు ఆల్ ఈజ్ వెల్ ఆర్గనైజేషన్ వారు సంయుక్తంగా నిర్వహించిన మొక్కలు నాటే ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్.కమల కుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ" 1972లో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ద్వారా ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఏర్పాటు చేయబడింది అని అలాగే ఈ యొక్క 2022 జూన్ 5తో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సంబరాలు 50 ఏళ్లు పూర్తయిందని పేర్కొన్నారు. ప్రకృతి,పచ్చదనం మరియు పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కలిగిం చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రవేశ౯పెట్టడం జరిగిందని, ఈసారి"ఓన్లీ వన్ ఎర్త్" నినాదంతో పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా ప్రయత్నించాలని ఐక్యరాజ్యసమితి తెలిపారని, ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయినటువంటి ఆల్ ఈజ్ వెల్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ ఎం. కిషోర్ కుమార్ గారికి అలాగే సంస్థ సభ్యులు కమలాకర్, రాజ్ కుమార్, రవి వర్మ గార్లకు ప్రత్యేక శుభాకాంక్షలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. అధికారి శ్రీనివాస్, అధ్యాపకులు అప్పారావు, శ్రీదేవి, శ్రీనివాస్, రజిత మొదలగు బోధన, బోధనేతర సిబ్బంది మరియు ఆల్ ఈజ్ వెల్ ప్రతినిధులు వారి కుటుంబభ్యులతో పాల్గొన్నారు.

# పర్యావరణ హితమైన అభివృద్ధి అవసరం


మొక్కలు నాటుతున్న వీసీ జగన్నాథరావు

**- నన్నయలో మొక్కలు నాటిన వీసీ జగన్నాథరావు**

**05.06.22 (మీడియాసెల్)** అభివృద్ధి పేరుతో ప్రకృతిని కలుషితం చేయకుండా, పర్యావరణ హితమైన సుస్థిర అభివృద్ధిని సాధించాల్సిన అవసరం ఎంతో ఉందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదివారం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, జి.ఎం (జియాలజీ) ఇంచార్జ్ హెచ్ఎఫ్బి, కెజి – బేసిన్, రాజమండ్రి బిఎస్ఎస్.కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరై విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఈసీ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఒకే ఒక భూమి అనే నినాదంతో నేడు ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. అన్ని జీవులకు పర్యావరణంపై సమానమైన హక్కులు ఉన్నాయన్నారు. మానవ మేధస్సును బట్టి ఇతర జీవుల హక్కులను హరిస్తూ పర్యావరణాన్ని పాడుచేస్తున్నారని చెప్పారు. భూమిని అత్యంత కలుషితం చేసే జీవులలో ప్రథములు మానవులేనన్నారు. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారని చెప్పారు. పర్యావరణ హితంగా జీవిస్తూ సుస్థిరమైన అభివృద్ధిని సాధించాలని తెలిపారు. విశ్వవిద్యాలయాన్ని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దేందుకు ఓ.ఎన్.జి.సి నిధులు ఇచ్చిందని, వాటికి తగినట్టుగా విశ్వవిద్యాలయం తరుపున మ్యాచింగ్ నిధులను కేటాయించామన్నారు. మొత్తం నిధులతో విశ్వవిద్యాలయంలో మొక్కలు నాటి, సుందరంగా ఆహ్లాదకరంగా తయారు చేస్తామన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరిస్తున్న ఓ.ఎన్.జి.సి కి వీసీ ధన్యవాదాలు తెలిపారు. జి.ఎం బిఎస్ఎస్.కృష్ణమూర్తి మాట్లాడుతూ భూమి కాలుష్యం బారిన పడి అనారోగ్యానికి గురి అయిందని జీవితాన్ని బాగు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని భావితరాలకు చక్కని వాతావరణం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, జియో సైన్సెస్ విభాగాధిపతి డా.కె.నూకరత్నం, సి.ఈ. ఎస్.లింగారెడ్డి, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## మంచిమాట

**ఏకాగ్రత పెంపొందేకొద్దీ ఎక్కువ విజ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఎందుకంటే ఏకాగ్రతే జ్ఞాన సముపార్జనకు ఏకైక మార్గం.**

The more this power of concentration, the more knowledge is acquired, because this is the one and only method of acquiring knowledge.

**- స్వామి వివేకానంద.**

# ఫ్యాకల్టీ అసోసియేట్‌గా ఎం.రామకృష్ణ

## ఉత్తర్వులు అందించిన వీసీ జగన్నాథరావు


ఫాకల్టీ అసోసియేట్ గా బాధ్యతలందిస్తున్న వీసీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎగ్జామినేషన్ విభాగంలో ఫ్యాకల్టీ అసోసియేట్ గా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అధ్యాపకులు ఎం.రామకృష్ణను నియమిస్తూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉత్తర్వులు అందించారు. యూనివర్సిటీలో వీసీ కార్యాలయంలో రామకృష్ణకి ఉత్తర్వులు అందించిన వీసీ జగన్నాథరావు వివరాలను తెలియజేసారు. వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పరీక్ష విభాగాన్ని సాంకేతికంగా అభివృద్ధి చేయడంలో భాగంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, డిపార్టమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్సెస్ అధ్యాపకులు ఎం.రామకృష్ణను ఫ్యాకల్టీ అసోసియేట్ గా నియమించామన్నారు. రామకృష్ణ పరీక్ష విభాగానికి సంబంధించిన అన్ని సాఫ్ట్ వేర్ సంబంధిత అంశాలను పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రశ్న పత్రాల డిలివరీతో సహా వివిధ పనుల కోసం అంతర్గత సాఫ్ట్ వేర్ ను అభివృద్ధి చేస్తారని చెప్పారు. ఆన్లైన్ పరీక్ష దరఖాస్తు, ఆన్లైన్ హాజరు వంటి పరీక్ష సంబంధిత అంశాలలో సహకరిస్తారని తెలిపారు. విశ్వవిద్యాలయ పరీక్ష విభాగానికి ఎంతో ఎక్కువ బాధ్యత ఉందని దానిని సమర్థవంతంగా నిర్వహించాలని వీసీ జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి.ఆచార్య ఎస్.టేకి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్. లింగారెడ్డి లు రామకృష్ణకు సూచించి అభినందనలు తెలిపారు.

# నన్నయ క్రికెట్ జట్టు ఎంపికలను ప్రారంభించిన వీసీ

**01.06.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ క్రికెట్ జట్టు ఎంపికలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు బుధవారం ప్రారంభించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ కు విశేష స్పందన వచ్చింది. విశ్వవిద్యాలయ ప్రాంగణంతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల నుండి 106 మంది క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ గోదావరి జిల్లాల్లోని క్రీడా కారులను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రోత్సహిస్తుందని అన్నారు. విశ్వవిద్యాలయంలో రెండు రోజుల విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక ప్రక్రియను నిర్వహించామని చెప్పారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ కు ఆర్గనైజింగ్ చైర్మన్ గా ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డా.వి.వి.ఎం.యు ఫణీంద్ర వ్యవహరిస్తున్నారన్నారు. అర్హత, ఆసక్తిగల 106 మంది క్రీడాకారులు దీనిలో పాల్గొన్నారన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను కనపరచి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. జట్టు ఎంపిక చేసే పరిశీలకులు ప్రతిభకే ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతిభావంతులైన క్రీడాకారులతో దృఢమైన జట్టును ఎంపిక చేయాలని సూచించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్రికెట్ జట్టు ఈ నెల 6వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరిగే హిందుస్తాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ చెన్నై సౌత్ జోన్ క్రికెట్ మ్యాచ్ కు ఎంపికవుతారన్నారు. తరువాత క్రీడాకారులకు శుభాకాంక్షలను తెలియజేసారు. క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపేందుకు వీసీ జగన్నాథరావు బ్యాటింగ్ చేసి, బౌలింగ్ చేసి క్రికెట్ జట్టు ఎంపికలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్మన్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.వి.వి.ఎం.యు.ఫణీంద్ర అబ్జర్వర్ డా.బి.రామ్ గోపాల్, మెంబర్స్ వి.ఎస్.దేవానంద్, ఎం.అజయ్ కుమార్, డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


బ్యాటింగ్ చేసి క్రికెట్ జట్టు ఎంపికలను ప్రారంభించిన వీసీ

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in